8న ఉచిత వైద్య శిబిరం

చింతల్: చింతల్‌కు చెందిన ప్రాణధార సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో భగత్‌సింగ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 8న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బీజేవైఎం యువ నాయకుడు సాయిప్రకాశ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే శిబిరంలో బీపీ, డయాబెటిస్, గుండె, కీళ్ల సంబంధిత పరీక్షలు చేసి మందులు అందిస్తారని, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయ దశమ వార్షికోత్సవం షురూ

రంగారెడ్డినగర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని శ్రీహరిహర అభయాంజనేయస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకు మంగళ వాయిద్యాలు, హరిహరాదులకు, ఇతర దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



రెవెన్యూ విషయాలు తెలుసుకుంటున్న ట్రైనీ ఐఏఎస్‌లు

సుభాష్‌నగర్: శిక్షణలో భాగంగా ఆరుగురు ట్రైనీ ఐఏఎస్‌లు కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డీటీ మల్లికార్జునరావు రెవెన్యూ సంబంధించిన పలు వివరాలను వారికి తెలియజేశారు. సూరారంలోని శ్రీకృష్ణనగర్ పరిధిలోని అటవీ, ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర భూముల గురించి వివరించారు.

స్థల పరిశీలన



పరిశీలిస్తున్న జేకే శేఖర్ యాదవ్

జగద్గిరిగుట్ట: జగదిరిగుట్ట కొండపై గల వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఇటీవల నూతన ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తయ్యేందుకు తనవంతూ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత అంజన్‌గౌడ్, జనసేన నాయకుడు సతీశ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు గణేశ్, ఆలయ డైరెక్టర్లు వేణు గౌడ్, రవి, సునీత, ఇంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: వికాస్ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ రెడ్డి కాలనీ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సాయినగర్, రెడ్డికాలనీ, అలాగే 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బీకే ఎన్‌క్లేవ్ రెడ్డి కాలనీ భాగం, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జీడిమెట్ల డిపో తనిఖీ



జీడిమెట్ల డిపోలో తనిఖీ నిర్వహిస్తున్న ఆర్ఎం సుచరిత

జీడిమెట్ల: జీడిమెట్ల బస్సు డిపోను సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కల్యాణి గురువారం తనిఖీ చేశారు. డిపోలోని విభాగాలను పరిశీలించి పలువురు ఉద్యోగులతో మాట్లాడారు. బస్సు సర్వీసులు, మెకానిక్ విభాగం, మెయింటనెన్స్, డీజిల్ పొదుపు, సూపర్ లగ్జరీ బస్సుల పనితీరు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిపో ప్రాంగణంలో మొక్క నాటారు. జీడిమెట్ల డిపో నిర్వహణ తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. డిపో మేనేజర్ ఆంజనేయులు తదితర ఉద్యోగులు ఉన్నారు.



దుండిగల్ పెద్ద చెరువు వద్ద మొక్క నాటి నీళ్లు పోస్తున్న దృశ్యం



లింగయ్య చెరువు వద్ద మొక్కలకు నీళ్లు పోస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి



మొక్కలు నాటుతున్న దృశ్యం

వనాలతోనే మానవ మనుగడ

–ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: వనాల పెంపుతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొంపల్లి మున్సిపల్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సతీశ్‌సాగర్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టగా ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల హాజరై కాలనీలో మొక్కలు నాటారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యదర్శి భరత సింహారెడ్డి, అసెంబ్లీ కో.కన్వీనర్ శివాజీ రాజు, మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరితారావు, జనార్దన్ రెడ్డి, మధు, అశోక్, శంకర్ నాయక్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ పెద్ద చెరువు వద్ద..

దుండిగల్: దుండిగల్ పెద్ద చెరువు వద్ద గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా మల్లంపేటలో మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛతా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, రెవెన్యూ అధికారి ప్రభాకర్, మున్సిపల్ ఇంజినీర్ సురేందర్ నాయక్, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగయ్య చెరువు వద్ద ..

కుత్బుల్లాపూర్: 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొంపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య చెరువు వద్ద మొక్కలు నాటారు. అనంతరం దూలపల్లి లింగయ్య చెరువు నుంచి దూలపల్లి వార్డ్ ఆఫీస్ వరకు స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎస్. వెంకటేశం, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకుంట చెరువు పార్కులో..

నిజాంపేట్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ప్రధాని మోదీ ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి పాల్గొని ఎర్రకుంట చెరువు పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నిజాంపేట బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్, డాక్టర్ ఎంరాఎస్ రాజు, పద్మప్రసాద్, సుమన్‌రావు, నాగరాజు, మదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ గ్లోబెల్ స్కూల్‌లో..

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవినగర్‌లోని ఎస్పీఆర్ గ్లోబల్ స్కూల్ లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి జగద్గిరిగుట్ట సీఐ నరసింహతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ చైర్మన్ చైతన్య పున్నారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొంపల్లి వేంకటేశ్వర కాలనీలో మొక్కలు నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్

చైతన్య విద్యానికేతన్ హై స్కూల్ లో ..

జగద్గిరిగుట్ట: మగ్దూంనగర్‌లోని చైతన్య విద్యానికేతన్ హైస్కూల్లో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ.. భావి తరాలకు మంచి వాతావరణాన్ని ఇవ్వడమే మన ప్రధాన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్త మధుబాబు చికిలే, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ తూటే విజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం రామిరెడ్డి, రామకృష్ణ, గీత, సంగీత,సుమ, సరిత, శరణ్య సుధా, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జీడిమెట్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మేడ్చల్ జిల్లా పీసీబీ అధికారి రాజేందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జీడిమెట్లలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలు పరిశ్రమల ఉద్యోగులు, జేఐఏ, ఐలా, టీఎస్ఐఐసీ అధికారులు ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జీడిమెట్ల పారిశ్రామికవాడలో గ్రీన్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీడిమెట్లలోని జేఐఏ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జీడిమెట్ల పరిశ్రమల్లో కాలుష్యం లేకుండా ఉత్పత్తులు తయారు చేయాలని, అదే విధంగా రసాయన, ఫార్మా పరిశ్రమల్లో వెలువడిన వ్యర్థాలను జేఈటీఎల్‌కు తరలించాలని కోరారు. కార్యక్రమంలో జేఐఏ అధ్యక్షుడు కిశోర్, ఐలా చైర్మన్ పి.డి.ఎస్.ఎన్.రాజు, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, ఐలా కమిషనర్ వాణి, తెలంగాణ పీసీబీ సహాయక పర్యావరణ శాస్త్రవేత్త లింగయ్య పాల్గొన్నారు.

ప్రశాంతవనం పార్కులో ..

జీడిమెట్ల ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లోని పార్కులో వాకర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పార్కులు ఏర్పాటు చేయడం వలన ప్రశాంతంగా వాకింగ్, యోగా చేసుకుంటున్నామని పేర్కొన్నారు.



ఎస్పీఆర్ గ్లోబెల్ స్కూల్ ఆవరణలో ..



జీడిమెట్లలో ర్యాలీ తీస్తున్న దృశ్యం



ప్రశాంతవనంలో మొక్క నాటుతున్న వాకర్లు

స్టేడియాన్నే అడ్డాగా చేసుకుని..

- వ్యభిచారం నిర్వహిస్తున్న వైనం
- నిర్వాహకుడు, ఇద్దరు విటుల అరెస్టు

దుండిగల్: స్టేడియాన్నే అడ్డాగా చేసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దుండిగల్ తండా–2కు చెందిన కొర్ర భాగ్యరాజ్ అలియాస్ శివ నాయక్ (30) స్క్రాబ్ వ్యాపారం చేస్తుంటాడు. కాగా సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వ్యభిచార వృత్తిని ఎంచుకున్నాడు. ఇందులో భాగంగా తెలిసిన వారి ద్వారా ఆన్‌లైన్‌లో యువతులను ఆకర్శించి వ్యభిచార రొంపిలోకి దింపుతున్నాడు. వారికి ముందుగానే ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి తాను చెప్పిన ప్రాంతానికి పిలిపించేవాడు. ఈ క్రమంలో గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన ఇద్దరు విటులతో బేరం కుదుర్చుకున్న శివ నాయక్ వారిని బుధవారం రాత్రి దుండిగల్ మున్సిపల్ కార్యాలయ సమీపంలోని స్టేడియం వద్దకు రప్పించాడు. అప్పటికే అక్కడే వేచి చూస్తున్న ఇద్దరు యువతులను వారికి అప్పగించాడు. స్టేడియంలోని నిర్మానుష్య ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడు శివనాయక్‌తో పాటు విటులు మనోజ్, వంశీ, ఇద్దరు సెక్స్ వర్కర్లను అదుపులోకి తీసుకుని దుండిగల్ పోలీసులకు అప్పగించారు.

ప్రేమ విఫలమై వ్యక్తి ఆత్మహత్య



రాజీవ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ప్రేమ విఫలమై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అసోం రాష్ట్రంలోని మల్లెగూడెం మండలం సింగయ్య గ్రామానికి చెందిన రాజీబ్ బోడ (41) బతుకుదెరువు కోసం 11 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి సుచిత్ర వెన్నెలగడ్డలో ఉంటున్నాడు. సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించే రాజీబ్ ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆతనికి గతంలో విడాకులు అయినట్లు తెలుసుకున్న సదరు యువతి ప్రేమను నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన అతని ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మ ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవం



పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని హస్మత్‌పేట చౌరస్తాలో గల దుర్గామాత, పరమేశ్వర సమేత రేణుకా ఎల్లమ్మ ఆలయం ముఖద్వార ప్రారంభోత్సవాన్ని టీపీసీసీ కార్యదర్శి దండువుల యాదగిరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున యాదవ్, ఏఎంసీ డైరెక్టర్లు రాజేందర్, అస్లాం, కేపీహెచ్‌బీ ప్రెసిడెంట్ ప్రవీణ్ , రవీందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్, నాయకులు షాహెన్షా, కనకరాజు, సందీప్, కిరణ్ గౌడ్, దండగుల అమూల్య , విజయలక్ష్మి, రమాదేవి, ప్రగతి, రేష్మా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో పైపులైన్ పగిలి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. ఈ విషయమై కాలనీవాసులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి అధికారులతో కలిసి గురువారం కాలనీలో పర్యటించి పరిశీలించారు. సమస్యను త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకవస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఏఈ ప్రియాంక, సూపర్‌వైజర్ నరేంద్ర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

రాష్ట్ర జూడో అసోసియేషన్ కమిటీ అభినందన సభ



సభలో జూడో నూతన కమిటీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని రిషి ఇంజినీరింగ్ కళాశాలలో ఆ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ రాజశ్రీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ నూతన కమిటీ అభినందన సభను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయవాది సుధాకర్ రావు హాజరై మాట్లాడుతూ.. జూడో క్రీడాభివృద్ధికి, తెలంగాణ జూడో సంఘం బాధ్యుల సహాయ సహకారాలతో రానున్న రోజుల్లో మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లాలో రాష్ట్ర, జాతీయస్థాయి జూడో పోటీలు నిర్వహణకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రాష్ట్ర జూడో అధ్యక్షుడు కైలాష్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నూతన కమిటీలు వేయడంతో పాటు జూడో క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అజీజ్ ఫారూఖీ, కోశాధికారి ఎంఎస్ రవీందర్, ఉపాధ్యక్షుడు డా. రామ్ లక్ష్మణ్, జెల్లెల శ్రీనివాస్‌రావు, రమాదేవి, సంయుక్త కార్యదర్శి దుపాకి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయం వద్ద ట్రాఫిక్ జాం



ఆర్టీఓ కార్యాలయం వద్ద నిలిచిన వాహనాలు

కుత్బుల్లాపూర్ : పేట్ బషీరాబాద్‌లోని మేడ్చల్ ఆర్టీవో కార్యాలయంలో ప్రైవేట్ ట్రావెల్స్‌తో పాటు స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. స్పందించిన అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వివిధ కాలనీల ప్రజలు, వాహనదారులు సర్వీస్ రోడ్ మీదుగా రాకపోకలు సాగించడం వల్లే ఈ సమస్య ఎదురవుతుందని, ముఖ్యంగా ఫిట్‌నెస్ కోసం వచ్చే వాహనాలు సైతం గంటల తరబడి రోడ్డు పక్కనే పార్క్ చేయడం కూడా సమస్యకు కారణం అవుతుందని స్థానికులు వాపోతున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్త శ్రీ రంజిత

దుండిగల్: పంటల సాగుకు ముందు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ పి. శ్రీరంజిత అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా డి.పోచంపల్లిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో మెళకువలు, ఎరువుల వాడకం, చీడపురుగుల నివారణ, సాంకేతిక వ్యవసాయం తదితర అంశాలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్త భానుకిరణ్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల పీహెచ్‌డీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కుత్బుల్లాపూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ రామిరెడ్డినగర్‌లో శ్రీలక్ష్మీ గణపతి, ఆంజనేయస్వామి, నవగ్రహ దేవతల చతుర్దశ 14వ వార్షికోత్సవం, మల్లికార్జున స్వామి, శ్రీ షిర్డీ సాయిబాబా, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవతల ఆలయాల తృతీయ వార్షికోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఆలయ కమిటీ సలహాదారులు వామన్ గుప్తా, రామలింగం గుప్తా, అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోవిందరావు, కోశాధికారి చంద్రమౌళి గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్

మధుర మీనాక్షిని దర్శించుకున్న ఎమ్మెల్యే..

చింతల్ డివిజన్ రోడామేస్త్రినగర్‌లోని మధుర మీనాక్షి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని పూజలు నిర్వహించారు.

వైభవంగా భీమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కుత్బుల్లాపూర్: బాలాజీ లేఅవుట్‌లోని భీమేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు వేద పండితులు ఆశీర్వచనలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చౌదరిగారి బుచ్చిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అంజన్న, వెంకటేశ్వర్లు, తీర్మాల్, వేణు, కల్యాణ్, నాగరాజు, ధర్మ, శ్రీధర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కూన శ్రీశైలంగౌడ్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

టాయిలెట్ నిర్వహణపై పట్టింపేది..?

- 2 నెలల కిత్రం కూలిన వైనం
- పట్టించుకోని అధికారులు

రంగారెడ్డినగర్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ల డొల్లతనం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ నుంచి బాలానగర్‌కు వెళ్లే రహదారిలో ఆదర్శ్‌నగర్ బస్టాప్ సమీపంలో టాయిలెట్ డబ్బాను ఏర్పాటు చేశారు. 2 నెలల క్రితం ఈదులు గాలులతో కురిసిన వర్షానికి కుప్పకూలింది. టాయిలెట్ బేస్‌మెంట్ మొత్తం తుప్పు పట్టడంతో పై భాగం ఊడిపోయింది. ఇప్పటికే టాయిలెట్‌లోని నల్లాలు, పైభాగంలోని ట్యాంక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లగా కంబోర్డ్ మాత్రమే మిగిలింది. అయినా జీహెచ్ఎంసీ అధికారులు అలాగే వదిలేయడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టాయిలెట్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



ఆదర్శ్‌నగర్ బస్టాప్ సమీపంలో కూలిన టాయిలెట్